# సీతమ్మ




"ఇంకా పన్నెండు రోజుల్లో నే నిప్పుడు చేస్తున్న ఈ యజ్ఞం పూర్తవుతుంది. అప్పటిదాకా మీ రుండి తీరాలి. నిజంగా నే నెంత అదృష్టవంతుణ్ణి! అయాచితంగా మీవంటి మహర్షి, సాక్షాత్తు బ్రహ్మదేవుడితో సరిసమానులైన మీరు నా ఇంటికి విచ్చేశారు" అన్నాడు జనక మహారాజు.

విశ్వామిత్రుడు మందస్మితం చేశాడు. రాజును, ఆయన వెంట వచ్చిన శతానందులవారిని, ఇంకా ఇతర మునులను కూచోవలసిందిగా కోరాడు.

విశ్వామిత్రులవారు కూచున్న తర్వాత వాళ్ళంతా కూచున్నారు.

అందరి కళ్ళు రామలక్ష్మణుల మీదనే ఉన్నాయి. వాళ్ళ అంద చందాలనుంచి కళ్ళు తిప్పుకోలేక పోతున్నారు. ఇక జనక మహారాజు ఉండబట్టలేక పోయినాడు. "ఈ సుకుమారులు, ఈ చక్కని తండ్రు లెవరయ్యా" అని అడిగాడు.

విశ్వామిత్ర మహర్షి పెదవులమీద మొలక నవ్వులు మొలిచాయి. "వీళ్ళా?! వీళ్ళిద్దరూ దశరథ మహారాజు కొడుకులయ్యా. అమిత విక్రములు. రామ లక్ష్మణులు. పరమ సుందరులు. ధీరులు. వీరులు. వీళ్ళ పరాక్రమం వల్లే నా యజ్ఞం నిర్విఘ్నంగా సాగిపోయింది. నా యజ్ఞ సంరక్షణ కోసమే దశరథ మహారాజు దగ్గరకు వెళ్ళి బతిమాలి ఈ చక్కనయ్య లిద్దరినీ తెచ్చుకున్నాను. నా యాగం రక్షించడమే కాదు. వీళ్ళు నాతో రావడంవల్ల అహల్యా శాపం కూడా తీరిపోయింది. వీళ్ళు నా వెంట ఎందుకున్నారని కదూ నీ మనసులో కుతూహలం? నేను జనక మహారాజు యజ్ఞం చూడటానికి వెళుతున్నా మరా నా కన్న తండ్రులారా అని చెపితే వీళ్ళు అన్నారు కదా! ఆయన ఇంట్లో శివుడి విల్లు ఉందట. ఆ విల్లు చూడాలని మాకు మహా సరదా పుడుతున్నది అన్నారు. సరే, రండి అన్నాను. వచ్చారు" అని విశ్వామిత్రు డేదో చెప్పబోతున్నాడు.

శతానందుల వారికి కళ్ళు జలజలలాడాయి. ఆయన నిలువెల్లా పులకించి పోయినాడు. ఆయన ముఖం ఆశ్వయుజ మాసపు పున్నమ చందమామ లాగా అయిపోయింది. మా అమ్మ, మా అమ్మ అనుకుంటే ఆయన మాట పెగుల్చుకోలేక పోతున్నాడు. ఆయన రాముడి వేపే చూస్తూ ఉండిపోయినాడు.

"రామా, రామా! నువ్వెంత మహానుభావుడివయ్యా! మా నాన్న గౌతముడూ, మా అమ్మ అహల్యా, నీ రాక వల్ల మా ఆశ్రమమూ పునర్జన్మం పొందినట్లే. పరమ పవిత్రమై పోయింది మా ఆశ్రమం. మా అమ్మ మళ్ళీ ఎప్పుడు మనిషవుతుందా అని తపించి పోతున్నాను. నీకు విశ్వామిత్రులవారూ, విశ్వామిత్రుడికి నీవూ దొరికారయ్యా. ఇంతకన్నా పరమానంద కరమైన, మహాద్భుతమైన సంగతి ఏముంది? ఈ విశ్వామిత్ర మహర్షి ఉన్నారే ఈయన మహిమ పరమాద్భుతమైనది. సప్తర్షు లందరిలోకీ ఈయనే గొప్పవాడు. ఈయన చరిత్ర ఉందే—అటువంటి

# పెళ్ళికానుకాయెనే.....

అద్భుతమైన, మహా సాహసమైన, నవరసభరితమైన చరిత్ర ఇంకెవ్వరికీ లేదు. సృష్టికి ప్రతి సృష్టి చేసి తన పంతం నెగ్గించుకున్నాడీయన. భూమండలం అన్ని దిక్కుల్లోనూ వేల కొద్ది సంవత్సరాలు తపస్సు చేశాడు. వసిష్ఠుల వారే వచ్చి తనను బ్రహ్మర్షి అని గౌరవించాలని పట్టుపట్టి ఆ పంతం నెగ్గించుకున్నారు'' అని రామ లక్ష్మణులు, జనక మహారాజు, అక్కడ చేరిన సదస్యులూ అంతా ఒళ్ళంతా చెవులు చేసుకొని వింటూ ఉండగా విశ్వామిత్రుడి శృంగార, అద్భుత, వీర, రౌద్ర గాథలన్నీ శతానందుడు వినిపించాడు. కుశ మహారాజుతో కథ మొదలెట్టి, ఆయన కుమారుడు కుశనాభుడు, ఆయన కొడుకు గాధి, గాధి తనయుడీ విశ్వామిత్రుడంటూ ప్రారంభించి వసిష్ఠుల వారితో విశ్వామిత్రుడికి స్పర్ధ కలగడం, త్రిశంకు మహారాజును సశరీరంగా విశ్వామిత్రులవారు స్వర్గానికి పంపించడం, మేనకతో కాపురం రంభ మీద అలిగి శపించడం—ఇవన్నీ చెప్పుకొచ్చారు శతానందులవారు. పొద్దు నడిగా మొదలెట్టిన ఆ కథలు పూర్తి అయ్యేవరకు సాయంకాల మైపోయింది. అక్కడ చేరిన మునులూ, రాచ కుటుంబమూ, రామ లక్ష్మణులూ విశ్వామిత్రుల వారి కథలు విని పొంగిపోయినారు.

"రే ప్రొద్దున్న వచ్చి మీ దర్శనం చేస్తాను. శివ ధనువు తెప్పించి ఈ రాజ కుమారులకు చూపిస్తాను'' అని జనక మహారాజు భయభక్తులతో, సంతోషంతో విశ్వామిత్రుడికి నమస్కరించి అంతః పురానికి వెళ్ళిపోయినాడు.

పొద్దున్నే తన మంత్రులను పంపించి విశ్వామిత్రుల వారిని, రామలక్ష్మణులను పిలిపించుకున్నాడు. 'తమ ఆజ్ఞ శిరసావహిస్తాను. సెలవీయండి' అని దోసిలొగ్గి విన్నవించుకున్నాడు జనకమహారాజు విశ్వామిత్రుల వారితో.

"హరుని విల్లు'' అన్నా రాయన.

"అవునవును'' అంటూ జనక మహారాజు విల్లు తన ఇల్లు ఎలా చేరిందీ ఇలా చెప్పారు:

"మా వంశకర్త నిమిఅనేమహాప్రభువు. ఆయనకు ఆరవ తరంలోని మహారాజు దేవరాతుడు. ఈ విల్లు నీ దగ్గర ఉంచవయ్యా మహానుభావా అని దేవతలు ఆయనకు ఇచ్చారు దీన్ని. దేవతలకు ఎట్లా లభించిందీ ధనువు అంటే, దక్ష యాగ సందర్భంలో తనకు జరిగిన అవమానానికి, అపకారానికి మహా కోపంవచ్చింది చంద్రజూటుడికి. కన్నబిడ్డనే కడుపున పెట్టుకున్నాడు పాపిష్ఠుడు దక్షుడు. కాల్చుకున్నాడు. కళ్ళు నెత్తిమీదికి తెచ్చుకున్నాడు. దాంతో కపర్దికి మహా కష్టమనిపించింది. కోపం ముంచుకొచ్చింది. విల్లు ఎక్కుపెట్టి అల్లెతాడు కూర్చాడు. క్షణేం—

అక్కిరాజు రమాపతిరావు

అక్కడున్న దేవతలంతా హాహాకారాలు చేశారు. అల్లకల్లోలమైపోయినారు. హరహరా, మహాదేవా అని చేతులు జోడించి ఏడ్చేశారు. నీవేకదా మాకు దిక్కు. మా తండ్రివి. మా రక్షకుడివి. ఇంత కోపం నీకు వస్తే మే మేమైపోవాలి అని ఆయన్ను బాగా పొగిడారు. దాంతో శివుడికి కోపం తగ్గిపోవడమేకాదు, దేవతలమీద అమితమైన జాలి కలిగింది. తనకు కలిగిన తీరరాని కష్టం సంగతే మరిచిపోయినాడు. దేవతల నందరినీ అమితంగా సంతోష పెట్టాలని, వాళ్ళకు తనవల్ల ఇక ఏమాత్రమూ భయంకూడా లేకుండా చేయాలని ఆయన మహాదేవుడు కాబట్టి, పట్టుకుపొండిరా, ఎందు కలా ఏడుస్తారు వణికిపోతూ అంటూ తన విల్లు వాళ్ళ కిచ్చేశాడు. దేవతలైతే మాత్రం ఆ విల్లును భరించగలరా? వాళ్ళు దాన్ని మా వంశంలో దేవరాతుడి కిచ్చారు భద్రంగా నీదగ్గరుంచవయ్యా అని. అదుగో అప్పటి నుంచీ మా ఇంట్లో ఉంటున్నది ఈ విల్లు. తరతరాలుగా మేము ఈ పినాక ధనువును అర్చించుకుంటూ వస్తున్నాం. అయితే ఒక వింత. ఏం జరిగిందో తెలుసా?

ఒకసారి నేను యజ్ఞం చేదామని శాస్త్రంలో చెప్పినట్లుగా భూమిశుద్ధికోసం నాగలి పూన్చి దున్నుతుండగా, అందాల మందసం ఒకటి దొరికింది నమ్మా! దాన్ని తెరచి చూదునుకదా! పండు జాబిల్లి రేకలాగా, మేఘం నుంచి జారిపడ్డ మెరుపులాగా ఒక చక్కని చుక్క, గారాల తల్లి అందులో ఉంది. బేష్! నాగటి చాలున లభ్యమైంది ఈ బంగారుతల్లి అని సీత అని పేరు పెట్టుకొని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాను. ఈ అమ్మాయి పర దేవత. అనన్య సామాన్య లావణ్య. ఈమెను మామూలు రాజుల కెవరికో ఎలా ఇచ్చి పెళ్ళి చేయగలను? ఈ తల్లి వీర్యశుల్క. ఈమెకు తగిన వరుడొచ్చిన నాడే పెళ్ళి చేస్తాను అనుకున్నాను. నా కొక ఉపాయం తోచింది. మా ఇంట్లో శివ ధనువు ఉంది కదా. దాన్ని ఎవరైతే ఎక్కుపెట్టగలరో వాళ్ళకుమాత్రమే ఈ బంగారు తల్లి నిచ్చి పెళ్ళి చేస్తాను అనుకున్నాను. అందరితో చెప్పాను. ఆశపడి వారూ వీరూ వచ్చి తెల్లమొహాలు వేసుకొని వెళ్ళిపోయినారు. వెళ్ళిపోయిన వాళ్ళు వూరుకున్నారా? కోదండం ఎక్కుపెట్టాలని కుంటిసాకొకటి పెడుతున్నాడీ జనకుడని అందరూ కూడబలుక్కుని నా మీదికి యుద్ధానికి వచ్చారు. ఒక సంవత్సరమంతా నాతో యుద్ధం చేశారు. నేను చాలా అలిసిపోయినాను. కానీ దేవతలు నాపట్ల దయ తలిచారు. అందువల్ల అందర్నీ ఓడించి వెళ్ళగొట్టాను. ఇదుగో చూదురుగాని ఉండండి—నా మనసులో ఏమిటో గాని ఉబలాటంగా ఉంది. ఈ రాముడు ఈ విల్లు ఎత్తితేచాలు, మా సీత నిద్దామని ఉంది'' అన్నాడు జనకమహారాజు.

విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వాడు. అవలొకటి దాన్ని చూడనివ్వవయ్యా నీ ఇల్లు బంగారంగానూ అన్నా రాయన. మంత్రులవేపు చూశారు జనక మహారాజు. వాళ్ళు హడావుడిగా వెళ్ళి మేరుపర్వతమా, వెండికొండా, ఉదయాచలమా, గంధమాదనమా అనిపించే పసిడికాంతి, తళతళ చక్రాల సందడి, శ్రీ గంధ సౌరభం అంతటా వ్యాపిస్తుండగా ఐదు వేల మంది మహాయోధులు పెద్ద మందసం లాగు



